ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 10 డిసెంబరు 2025



ప్రచారానికి తెర.. ప్రలోభాలకు ఎర..

- ఓటర్ల ప్రసన్నానికి అభ్యర్థుల చివరి అస్త్రాలు
- ముగిసిన తొలి విడత ప్రచారం
- రేపు 5 మండలాల్లో పోలింగ్



మంథని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు మండలాల్లో జరిగే తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ విజయం కోసం మిగిలి ఉన్న చివరి అస్త్రాలపై దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారం ముగిసిన పోలింగ్‌కు మరో 48 గంటల సమయం ఉండటంతో విజయం కోసం గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్ల ప్రసన్నం కోసం నానా తంటాలు పడుతున్నారు. గురువారం జిల్లాలోని 95 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, 685 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొత్తం 99 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా నాలుగు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం రెండు గంటలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఎన్నికల్లో విజయం కోసం వారం రోజులుగా గ్రామంలో, వార్డుల్లో ఓటర్లను కలిసి ప్రచారం చేసి గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ప్రాధేయపడ్డ అభ్యర్థులు వారిని మచ్చిక చేసుకోవడానికి కావాల్సిన వనరులపై దృష్టి సారించారు. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు అభ్యర్థులు మద్యం, నగదు, ఇతర బహుమతులు పంపిణీ చేసేయటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. పోలింగ్, ఎన్నికల ఫలితాలతో బుధ, గురువారాల్లో పల్లెల్లో ఎన్నికల సందడి కొనసాగనుంది.

రామగుండం కమిషనరేట్‌లో 163 సెక్షన్ అమలు

కోల్‌సిటీ/మంథని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రామగుండం కమిషనరేట్‌లో 163సెక్షన్ బీఎన్ ఎస్ఎస్ యాక్టు అమలులో ఉంటుందని సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. జిల్లాలో కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం మండలాల్లో మొదటి విడత ఎన్నికల నేపథ్యంలో మంగళవారం నుంచి 11వ తేదీ ఫలితాలు ప్రకటించే వరకు ఈ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నలుగురికి మించి గుంపులుగా చేరవద్దని, ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారి తీసే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు అనుమతి లేకుండా చేపట్టకూడదని, పోలింగ్ కేంద్రాలకు కిలోమీటర్ దూరంలో మారణాయుధాలతో సంచరించడం నిషేధమని, తాత్కాలిక షామియానాలు ఏర్పాటు చేసుకుంటే తప్పకుండా అనుమతి తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్లకార్డులు, గుర్తులు ప్రదర్శించడం చట్ట విరుద్ధమన్నారు. ఎన్నికల వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారి తీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకుంటే వెంటనే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, ఫారెస్టు, కేంద్ర బలగాలకు, హోంగార్డులు, ఎస్పీ వోలకు ఈ నిషేధాలు వర్తించవని తెలిపారు. అనుమతులు లేకుండా ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించరాదన్నారు.

- అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ భయం
- బ్యాలెట్ పత్రాల్లో పేర్లు, ఫొటోలు ఉండవు..
- గుర్తులు మాత్రమే ముద్రిస్తారు..
- గుర్తులపై అభ్యర్థుల ముమ్మర ప్రచారం

'గుర్తు' గుర్తుంచుకో..!



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తుల గుబులు పట్టుకున్నది. ఈ ఎన్నికల్లో ప్రతీ ఒక్క ఓటు కీలకమే కావడంతో ఓటర్లు గుర్తుంచు కునేలా అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ముగ్గురు, నలుగురు అభ్యర్థులున్న చోట పెద్దగా ఇబ్బంది లేకపోయినా, అంతకు మించి అభ్యర్థులు ఉన్న చోట క్రాస్ ఓటింగ్ జరుగుతుందోమోననే భయం పట్టు కున్నది. సర్పంచ్‌కు ఒకటి, వార్డు సభ్యుడి కోసం మరొక బ్యాలెట్ ఉండడం, ఓటర్లు రెండింటిపై ఓట్లు వేయాల్సి రావడంతో గుర్తుల విషయంలో కొంత మంది ఓటర్లు అయోమయానికి గురయ్యే అవకాశాలు లేకపోలేదు. కొన్ని గుర్తులు ఒకే పోలికతో ఉండడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. నిరక్షరాస్యులు, వృద్ధుల ఓట్ల గురించి అభ్యర్థులకు బెంగ పట్టుకున్నది. మన గుర్తుకు అనుకుని మరొకరి గుర్తుకు ఓటు వేస్తే ఫలి తాలు తలకిందులు కావచ్చని భావిస్తున్నారు. మెజారిటీ ఓటర్లకు గుర్తు గట్టిగా గుర్తుండి పోయేలా, ఓటర్లు మరచిపోకుండా గుర్తుంచుకునేలా అభ్యర్థులు ఇంటిల్లిపాది ప్రచారం చేస్తున్నారు. బ్యాలెట్ నమూనా పత్రా లు, డోర్‌పోస్టర్లు, కరపత్రాలతోపాటు బ్యానర్లు కట్టిస్తు న్నారు. కొందరు గ్రామాల్లో వాల్ రైటింగ్ కూడా చేయి స్తున్నారు. ఆటోలు పెట్టి మైకుల ద్వారా పాటలు పెట్టి గుర్తుల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలపై గుర్తులతో పాటు అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. కానీ పం చాయతీ ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహిస్తుంటారు. బ్యాలెట్లలో వరుస క్రమంలో కేవలం గుర్తులు మాత్రమే ఉంటాయి. అభ్యర్థుల పేర్లు, ఫొటోలు కాన రావు. తాము ఓటు వేయాలనుకున్న అభ్యర్థి గుర్తు పోలింగ్ బూతులకు వెళ్లినప్పుడు గుర్తుకు రాకుంటే మాత్రం ఒకరికి వేయాల్సిన ఓటు మరొకరికి పడు తుంది. ఫలితంగా అభ్యర్థుల జాతకాలు తలకిం దులయ్యే ప్రమాదం ఉంది. దీంతో అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తు

(మిగతా 8వ పేజీలో)

సోషల్ మీడియాలోనూ జోరుగా ప్రచారం...

వ్యక్తిగత ప్రచారంతోపాటు సోషల్ మీడియాలోనూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. హంగూ ఆర్భాటం లేకుండా తమ గ్రామానికి చెందిన ఓటర్లందరికీ తమ గుర్తు చేరేలా వాట్సాప్ గ్రూపుల్లో స్టేటస్ పోస్టు చేస్తూ ప్రచారం చేస్తున్నారు. తమకే ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఫోన్లు చేసి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. తమ గుర్తును ముద్రించిన కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. మొదటి విడత ఎన్నికలు సమీ పిస్తుండడంతో గ్రామాల్లో ప్రచార హోరు వేగం పుంజు కుంది. ఓటర్ల మనస్సుల్లో గుర్తులు బలంగా నిలిచేలా అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత మేరకు ఈ ఎన్నికల్లో ప్రచార సామగ్రిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. తమ గెలుపు కోసం అనేక తంటాలు పడుతున్నారు. ఓటర్లు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడకుండా గుర్తుల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

పెద్దపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కోయశ్రీహర్ష ఎన్నికల పరిశీలకులు అనుగు నరసింహారెడ్డి, డీసీపీ రాంరెడ్డి పాల్గొన్నారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో సమస్యలు తలెత్తకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వీర బుచ్చయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆశీస్సులతో అభివృద్ధికి తోడ్పడుతా

- తారుపల్లి సర్పంచ్ అభ్యర్థి గాజనవేన స్వరూప సదయ్య



తారుపల్లిలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి గాజనవేన స్వరూప సదయ్య

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆశీస్సులతో గ్రామాభివృద్ధికి తోడ్పడుతానని తారుపల్లి సర్పంచ్ అభ్యర్థి గాజనవేన స్వరూపసదయ్య అన్నారు. మంగళవారం తారుపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతించారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి సర్పంచ్‌గా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే సహకారంతో నిధులు తీసుకువచ్చి ఇప్పటికే రూ.15 లక్షలతో యాదవ కమిటీ హాల్ నిర్మించినట్లు తెలిపారు. కోటి55 లక్షలతో మీర్జంపేటకు వెళ్లే దారిలో నక్కలఒర్రెపై ఎమ్మెల్యే సహకారంతో బ్రిడ్జి మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో 32 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు మంజూరు చేయించామని నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. పాఠశాల ప్రహరీకి రూ.23లక్షలు, సీసీ రోడ్లకు రూ.30 లక్షలు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ.10లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేశారన్నారు. తారుపల్లి-కిష్టంపేట వరకు రహదారితోపాటు కాల్వశ్రీరాంపూర్ -తారుపల్లికి డబుల్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. మంచినీటి సౌకర్యం కోసం వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. అంతర్గత సీసీ రోడ్లు డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు తోడ్పడుతానన్నారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని స్వరూప సదయ్య కోరారు.

టోల్‌ఫ్రీ నంబర్ 1064తో అవినీతికి అడ్డుకట్ట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): టోల్‌ఫ్రీ నంబర్ 1064 కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి అవినీతి నిరోధక దినోత్సవం పురస్కరించుకొని విజిలెన్స్ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉంటూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు. మనమంతా నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ సూచించారు. ఎవరైనా లంచం ఇవ్వమని వేధిస్తే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వ అధికారులతో పని చేయించుకోవడం ప్రజల హక్కుఅని కలెక్టర్ ప్రజలకు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధికి కృషి

- కాల్వశ్రీరాంపూర్ సర్పంచ్ అభ్యర్థి బంగారి రమేష్



ఎమ్మెల్యేతో కలిసి కాల్వశ్రీరాంపూర్‌లో ప్రచారం చేస్తున్న బంగారి రమేష్

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహకారంతో కాల్వశ్రీరాంపూర్ గ్రామాభి వృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి బంగారి రమేష్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యేతో కలిసి ప్రచారం చేశారు. నీలకంఠ చెరువు సమీపంలో షాపింగ్ కాంప్లెక్స్‌తోపాటు చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మించి, బస్టాండ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఇప్పటికే గ్రామానికి కోటి రూపాయల నిధుల కేటాయించారన్నారు. రూ.17 కోట్లతో 30 పడకల ఆసుపత్రిని పునర్నిర్మాణం చేపడుతున్నారన్నారు. గ్రామంలో కోతుల బెడద లేకుండా చేస్తానన్నారు. పాండవుల గుట్టపై క్రీడామైదానానికి స్థలం కేటాయించి, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. కాల్వశ్రీరాంపూర్ నుంచి హైదరాబాద్, హన్మకొండకు ఆర్టీసీ బస్సులు నడిచేలా చూస్తామన్నారు. మల్లయ్యకుంట నుంచి నీలకంఠ చెరువు వరకు ఉన్న కట్టు కాలువకు మరమ్మతు, సాగునీరు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చేస్తానన్నారు. ఇల్లులేని ప్రతీ నిరుపేదకు డబుల్ బెడ్‌రూమ్‌తోపాటు స్థలం లేని వారికి స్థలం, ఇండ్లు మంజూరు చేయిస్తానన్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని, ఫుట్‌బాల్ గుర్తుపై ఓటు వేసి సర్పంచ్‌గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బంగారి రమేష్ కోరారు.

వేములవాడ బస్టాండ్ వద్ద ఒకరికి గుండెపోటు

సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద మంగళవారం గుండెపోటుతో కుప్పకూలిన వ్యక్తికి పోలీసులు సీపీఆర్ చేసినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. నాంపల్లి గ్రామానికి చెందిన రమేష్(49) అనే వ్యక్తి తిప్పాపూర్ బస్టాండ్ వద్ద గుండెనొప్పితో మంగళవారం ఉదయం కుప్పకూలడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్, గంగరాజులు సీపీఆర్ చేసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించినప్పటికీ రమేష్ మృతి చెందాడు.

చలికాలంలో నారు మడి

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో వరి సాగు చేసే రైతులు ఇప్పుడిప్పుడే నారుమడులు సిద్ధం చేసుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో వ్యవసాయ భూమి 16,92 ఎకరాలు సాగుకు యోగ్యమైన భూమి ఉంది. 12,623 ఎకరాలో వరి సాగు, 854 ఎకరాల్లో మొక్కజొన్న పప్పు దాన్యాలు 50, ఇతర పంటలు 85 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం చలి కాలంలో వరి సాగు చేసే రైతులు నారు మడులను రక్షించుకునేందుకు పలు సూచనలు చేస్తున్నారు.

● మండెకట్టి విత్తనాలు వేయడం తప్పనిసరి

దమ్ము చేసే నారుమడిలో మండెకట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరి. రాత్రి ఉష్ణోగ్రతలు 12 సెల్సియస్ డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు సరిగా ఎదగదు, కొన్ని సార్లు ఎర్రబడి చనిపోతుంటాయి. రెండు గుంటల నారుమడికి వానాకాలం సూచించిన మోతాదులో రసాయనిక ఎరువులతో (నత్రజని, పొటాష్) పాటు రెండు క్వింటాళ్ల మాగిన కోళ్ల ఎరువు లేదా గొర్రె ఎరువు లేద వర్మీ కంపోస్టు వేసి కలియ దున్నాలి. భాస్వరాన్ని దుక్కిలో మోతాదు రెట్టింపు చేయాలి. చలి సమస్యను అధిగమించడానికి నారుమడిపై వెదురు కర్రలతో ఊతం ఇచ్చిపైన పలుచని పాలిథిన్ షీట్స్ లేదంటే ఖాళీ సంచులతో తయారు చేసి పట్టాను సాయంత్రం వేళల్లో కప్పి ఉంచాలి. మరుసటి రోజు ఉదయం తీసేయాలి. యాసంగిలో జింక్ లోప లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ లోపాన్ని సవరించాలి. నారు ఆరోగ్యంగా పెరగడానికి కిలో యూరియాకు రెండు గ్రాముల, కార్బండిజమ్ 25 శాతం ప్లస్ మాంకోజెబ్, 50 శాతం డబ్ల్యూఎస్ మిశ్రమ మందును కలిపి వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాత్రి పూట నీరు నిండుగా ఉంచి తెల్లవారు జామున తొలగించి తాజాగా నీరు అందించాలని చెబుతున్నారు.



గోపాల్‌పూర్‌లో నారుమడి

ఇరిగేషన్‌శాఖ రాష్ట్ర కన్వీనర్‌గా సంగెం లక్ష్మణ్‌రావు



లక్ష్మణ్‌రావు

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల రాష్ట్ర అడ్‌హక్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా జిల్లాకు చెందిన సంగెం లక్ష్మణ్‌రావు నియామకమయ్యారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మణ్‌రావును సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన నాయకుడు రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇది టీఎన్‌జీవోకు ఎంతో గర్వకారణమని అన్నారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కూడా గతంలో ఇరిగేషన్‌శాఖ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి ఎడ్ల అరవింద్‌రెడ్డి, టీఎన్‌జీవో కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్ పాల్గొన్నారు.

అక్కపల్లిలో మహిళ ఆత్మహత్య



లక్ష్మీ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన మహిళ కొంపెల్లి లక్ష్మీ(42) అనారోగ్య సమస్యలు భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని స్థానికులు, పోలీసులు తెలిపారు. గ్రామంలోని లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా ఆమె ఆరోగ్యం కుదుటపడలేదు. మరో వైపు లక్ష్మీ భర్త ముత్యం ఇటీవల కాలు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తండ్రి కొడుకులు ముత్యం, మహేశ్‌లు కలిసి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి బయలుదేరారు. 45 రోజుల కిందట వివాహమైన కూతురు రాధిక పుట్టింటి నుంచి అదే రోజు అత్తగారింటికి వెళ్లింది. ఆరోగ్య సమస్యలు.. కట్టుకున్న భర్త అనారోగ్యంతో బాధపడుతుండడం వల్ల మనస్తాపం చెందిన ఆమె ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడి గట్టింది. రాత్రయిన లక్ష్మీ మాటలు వినిపించకపోవడంతో అనుమానం వచ్చిన సమీప బంధువులు ఇంటికి వెళ్లి చూశారు. తలుపులకు గడియ వేసుకున్న ఆమె ఎంత పిలిచినా పలకకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఉరి వేసుకుని విగత జీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న భర్త, కొడుకు హైదరాబాద్ నుంచి హుటాహుటిన వచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతురాలికి భర్త ముత్యం,కొడుకు మహేశ్, కూతురు రాధికలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య



రజిత (ఫైల్)

తంగళ్లపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో వివాహిత దీటి రజిత(31) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలోని అత్త గారింటి నుంచి రజిత ఐదు రోజుల క్రితం నేరెళ్ల లోని తన తల్లి గారింటికి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డింది. మూడు సంవత్సరాల క్రితం భర్త సంతోష్ అనారోగ్యంతో మృతి చెందాడు, అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న రజితకు అనారోగ్యం తోడవడంతో పాటు మానసిక స్థితి సరిగా లేక ఉరివేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి కూతురు సౌమ్య(11), శశాంక్(7) ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

1,125 కిలో మీటర్లు బైక్‌పై ప్రయాణం

● మార్గమధ్యలో ప్రమాద బీమాపై అవగాహన



ప్రమాద బీమాపై అవగాహన కల్పిస్తున్న అచ్యుత్

జమ్మికుంట, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ సర్వీస్ ఏజెంట్ సమ్మెట అచ్యుత్ వారణాసి వరకు బైక్‌పై ప్రయాణం చేశాడు. 1,125కిలో మీటర్లు ప్రయాణం చేస్తూ మార్గం మధ్యలో లారీ, ఆటో, బస్సు, ట్రక్కు ఇలా వాహన డ్రైవర్ల రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల (పిఎమ్ఎస్‌బివై) ప్రమాద బీమా వస్తుందని అవగాహన కల్పించాడు. ఈ ప్రయాణానికి సహకరించిన బ్యాంక్ మేనేజర్, సిబ్బందికి అచ్యుత్ కృతజ్ఞతలు తెలిపారు.

యూనివర్సిటీలో రెండో రోజు విద్యార్థుల ఆందోళన

- పరీక్షలు వాయిదా వేసిన ఎస్‌యూ అధికారులు

గణేశ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అకడమిక్ పరీక్షల తేదీలను వాయిదా వేయాలని కోరుతూ విద్యార్థులు రెండో రోజు మంగళవారం ఆందోళనకు దిగారు. నెట్, సెట్ వంటి పరీక్షలు, సర్పంచ్ ఎన్నికల తేదీలు పీజీ పరీక్షలు ఉన్నందున యూనివర్సిటీ పరీక్షలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో అధికారులు, విద్యార్థులతో వీసీ ఉమేష్‌కుమార్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ పరీక్షలను జనవరి 5 నుంచి నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉపకులపతి, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్, ప్రిన్సిపల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

బోయినపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని స్థంభంపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌తో పాటు సుమన్ అనే ఇద్దరు వ్యక్తులు స్థంభంపల్లి గ్రామానికి మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, బోయినపల్లి పోలీసులు దాడులు నిర్వహించి 1,33,000 రూపాయల విలువ గల 253 లీటర్ల మద్యం పట్టుకున్నారు. మద్యంతో పాటు వాహనం సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

చందుర్తి: అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం రామారావుపల్లి గ్రామనికి చెందిన పెద్దిగారి మల్లేష్ అనే వ్యక్తి తన కారులో అక్రమంగా 24 బీర్ సీసాలను తరలిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీలలో పట్టుబడినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం చందుర్తి ఇన్‌చార్జి ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జె. రమేష్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం

మహిళ దారుణహత్య

వెల్గటూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో మంగళవారం రాత్రి అలివేలు (37) అనే మహిళ దారుణహత్యకు గురైంది. మండలి నరేష్ అనే వ్యక్తి అలివేలును రోకలిబండతో తలపై మోది హత్య చేసిన సంఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్‌కు హైదరాబాద్‌లో ఓ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అలివేలుతో పరిచయం ఏర్పడింది. వారు అక్కడే సహజీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం స్తంభంపల్లికి వచ్చిన ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో నరేష్ కోపంతో రోకలి బండతో అలివేలు తలపై బలంగా మోదాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా నరేష్‌కు గతంలో వివాహం కాగా భార్య అతడికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డుపై గుర్తుతెలియని వృద్ధుడు(70) మంగళవారం మృతి చెంది ఉన్నట్లు గుర్తించామని టూటౌన్ పోలీసులు తెలిపారు. వృద్ధుడి మృతదేహన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు టూటౌన్ సీఐ ఫోన్. 8712670762, పోలీస్‌స్టేషన్ ఫోన్. 83319 40593, హెడ్‌కానిస్టేబుల్ సాయిబాబు 8712574215లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కరీంనగర్ క్రీడాకారుల ప్రతిభ

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిలా కేంద్రంలోని ఓక్లే ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. జిల్లాలో తొలి సారిగా రాష్ట్ర స్థాయి పోటీలు చేపట్టగా కరీంనగర్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. వయస్సు ప్రకారం గ్రూపులుగా విభజించి వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కాగా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా హైదరాబాద్ నిలవగా... ఆ తర్వాత స్థానాల్లో రంగారెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు నిలిచాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయిని రవికుమార్, కొమ్ము కృష్ణతో పాటు ప్రముఖ వైద్యులు క్రాంతికుమార్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థ సారధి, ఆదిత్య ఖండేష్కర్, బారే శ్రీధర్, రాజు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందచేసి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించి సత్తా చాటాలని అతిథులు ఆకాంక్షించారు. ఓడిపోయిన వారు నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో రాణించాలని సూచించారు. క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

అర్జీదారు వద్దకే వచ్చి భూమి రిజిస్ట్రేషన్



అర్జీదారు వద్ద వివరాలు తీసుకుంటున్న తహసీల్దార్ నాగార్జున

రాయికల్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): రాయికల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగార్జున అర్జీదారు వద్దకే వచ్చి భూమి రిజిస్ట్రేషన్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుమ్మరిపెల్లి గ్రామానికి చెందిన కొడిమ్యాల ఇందమ్మ తన భూమి విక్రయించారు. భూమి విక్రయ రిజిస్ట్రేషన్ కోసం కుటుంబ సభ్యులు ఆమెను తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం వరకు ఆటోలో తీసుకువచ్చారు. అర్జీదారు నడవలేని పరిస్థితిలో ఉందని తెలుసుకున్న తహసీల్దార్ మానవత్వంతో స్పందించి కార్యాలయం బయట ఆటోలో ఉన్న ఆమె వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

వైద్య కళాశాలలకు పార్థివ దేహాలను దానం చేయాలి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలకు పార్థివ దేహాలను దానం చేయడానికి ముందుకు రావాలని సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ కోరారు. మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన మందల రాజిరెడ్డి మృతి చెందగా వారి మనుమడు, మనుమరాలు వర్షిత్, వర్ష రాజిరెడ్డి పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ దేహదానాలు చేయడానికి ముందుకు రావాలని, దేహాలతో విద్యార్థులు అధ్యయనం చేస్తారని అన్నారు. సదాశయ ఫౌండేషన్ పార్థివ దేహాలను మెడికల్ కళాశాలకు చేర్చడంలో కీలక పోషిస్తున్నారని ఆయన అన్నారు. దేహదాత కుటుంబ సభ్యులను అభినందించారు. అనాటమి హెచ్‌ఓడీ శశికాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పన, సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, ప్రతినిధి దబ్బెట శంకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



రాజిరెడ్డి మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సమద్ నవాబ్ హఠాన్మరణం



సమద్ నవాబ్(ఫైల్)

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు పరిరక్షణ కమిటీ చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ సమద్‌నవాబ్(60) మంగళవారం సాయంత్రం మరణించారు. సోమవారం ఉదయం ఇంటి వద్ద ఉండగా ఒక్క సారిగా అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు.,


ఉప సర్పంచి ఎన్నిక ఇలా

కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప సర్పంచి పదవి కోసం ఇద్దరు. ముగ్గురు పోటీ పడితే సమావేశానికి హాజరైన సభ్యులు తమ చేతులను పైకి ఎత్తడం ద్వారా ఫలితాన్ని నిర్ణయిస్తారు. ఉప సర్పంచి ఎన్నిక కోసం వార్డు సభ్యుల్లో ఒకరి పేరును మరో వార్డు సభ్యుడు లేక సభ్యురాలు ప్రతిపాదించాలి. ఇంకో సభ్యుడు లేక సభ్యురాలు బలపరచాలి. ఒకరు మాత్రమే నామినేట్ అయితే సదరు అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటిస్తారు. ఈ ఎన్నికలో సర్పంచి కూడా ఓటేసేందుకు అర్హత కలిగి ఉంటారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సమానంగా ఓట్లు వస్తే సభ్యుల సమక్షంలోనే లాటరీ ద్వారా డ్రా నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు.

పంచాయతీ ఎన్నికలకు భద్రత కట్టుదిట్టం

● మద్యం, నగదు సీజ్ ● కోడ్ ఉల్లంఘనపై 6 కేసులు ● కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. కమిషనరేట్ కేంద్రంలో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన ఎన్నికల బందోబస్తు వివరాలను మీడియాకు వెల్లడించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటిని సున్నితమైన/సమస్యాత్మకమైన కేంద్రాలుగా విభజించామని తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో ఒక స్టాటిక్ పోలీసు పార్టీ, ప్రతీ మార్గంలో(రూట్) ఒక రూట్ మొబైల్ పార్టీ ఉండేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రతీ మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు, వారి అధీనంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కేటాయించినట్లు చెప్పారు. ఈ ఫోర్స్‌లో స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు పూర్తి స్థాయి రైట్ గేర్‌తో సిద్ధంగా ఉంటారన్నారు. కమిషనరేట్ పరిధిని మొత్తం 104 క్లస్టర్‌లుగా విభజించామని, ఎన్నికలు ప్రారంభం నాటి నుంచి ఈ క్లస్టర్లలో ప్రివెంటివ్ పెట్రోలింగ్ నిర్వహించడానికి సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌తోపాటు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను అదనంగా రాత్రి గస్తీ కోసం కేటాయించామన్నారు. గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ప్రలోభాలకు, భయ భ్రాంతులకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఇప్పటివరకు 132 అక్రమ మద్యం కేసులు నమోదు చేశామని, 10.71 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఆరు కేసులు నమోదు చేశామని, వాహన తనిఖీల్లో లక్ష రూపాయల నగదు పట్టుకున్నామని అన్నారు. రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తున్నామని, వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని వెల్లడించారు.



● చర్చిలో ప్రచారం.. సర్పంచ్ అభ్యర్థిపై కేసు

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మతపరమైన ప్రదేశంలో ప్రచారం నిర్వహించినందుకు గంగాధర గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి చిరుత మంగ (భర్త రమేష్) చర్చిలో సమావేశం నిర్వహించారు. తమ గుర్తు చూపిస్తూ ఓట్లు అభ్యర్థించడంపై కేసు నమోదు చేశారు.

● వార్డు అభ్యర్థిపై..

ఎన్నికల ప్రచారం కోసం ముద్రించిన కరపత్రంలో, ఒక వ్యక్తి అనుమతి లేకుండా అతడి పేరును ప్రచురణ కర్తగా ముద్రించినందుకు వార్డు అభ్యర్థిపై కేసు నమోదైంది. రామడుగు గ్రామంలో 8వ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్న అభ్యర్థి సైళ్ల బీరయ్య ఎన్నికల కరపత్రాల్లో అనుమతి లేకుండా తన పేరును ప్రచురించి, గ్రామంలో పంపిణీ చేసినట్లు పూరెళ్ల మధుకర్ ఫిర్యాదు చేశాడు.

● చొప్పదండి మండలంలోని ఆర్నకొండ శివారులో సోమవారం పోలీసుల తనిఖీల్లో తమ్మిడి కనకరాజు, గోల్కొండ మధుకర్ మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మద్యంతో పట్టుబడిన కనకరాజు భార్య ఆర్నకొండ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఎన్నికల్లో గెలవడం కోసం ఓటర్లకు పంపిణీ చేయడానికి మద్యాన్ని తరలిస్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. రూ.49,920 విలువైన మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● మానకొండూరు మండలం చెంజర్లలో సర్పంచ్ అభ్యర్థి గోల్లేన కనుకవ్వ సీరియల్ నంబర్‌ను తప్పుగా ముద్రించిన నకిలీ నమూనా బ్యాలట్ పేపర్లు పంపిణీ చేసి, ఓటర్లను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించినట్లు కత్తెర గుర్తుపై పోటీ చేస్తున్న గడ్డి రేణుకతో పాటు గడ్డి గణేష్, ఆదిత్య ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై కేసు నమోదు చేశారు.

● కరీంనగర్ రూరల్ మండలం చెర్లభూత్కూర్‌లో మద్యం పంపిణీ చేస్తున్న వార్డు అభ్యర్థి జడా అంజయ్య, అతడి స్నేహితుడు చిట్కూరి మల్లేష్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదైంది.

ధర్మపురి నరసింహుని సన్నిధిలో జీయర్‌స్వామి పూజలు



జీయర్‌స్వామికి ప్రసాదాలు అందిస్తున్న ఆలయ చైర్మన్, అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి మంగళవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో పీఠాధిపతి ప్రత్యేక పూజలు జరిపారు. అంతకు ముందు యమధర్మరాజు ఆలయం వద్ద స్వామీజీ భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన స్వామీజీకి శేషవస్త్రం, పండ్లు, ఫలాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఉన్నారు.

నిరుద్యోగ యువతకు
స్వయం ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు

జమ్మికుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ల పథకం ముఖ్య ఉద్దేశ్యమని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ల పథకంపైన నాబార్డ్ ఆధ్వర్యంలో శిక్షణ నైపుణ్య కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా హోల్డర్లు, వ్యవసాయ సంబంధిత కోర్సులు చేసిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. నాబార్డ్ డిడియం జైప్రకాష్ మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రకల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన నోడల్ శిక్షణ సంస్థల ద్వారా 45రోజుల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు తమ వ్యాపార యూనిట్లు స్థాపించడానికి బ్యాం కుల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికా రిణి భాగ్యలక్ష్మి, కెవికె ప్రధానకార్యదర్శి విజయ్‌గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ముస్తాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోయినికుంట గ్రామానికి ఓ వ్యక్తి మద్యాన్ని వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్ నుంచి మోయినికుంట గ్రామానికి చెందిన పల్లాటి కుమార్ అనే వ్యక్తి 167 మద్యం బాటిళ్లను మోయినికుంటకు ఓ కారులో తరలిస్తుండగా పట్టుకొని కారును, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

- పైసా ఖర్చు లేకుండా అభ్యర్థుల ప్రచార హోరు
- ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు
- ప్రచార ఫొటోలు... వీడియోలు..

సోషల్ మీడియాలు..
ప్రచార అస్త్రాలు



ముత్తారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. పోటీదారులు ప్రచారాన్ని ముమ్మరంచేశారు. రోడ్ల వెంట వెళ్లే వారిని సైతం పలకరిస్తూ వారికి ఏ అవసరం ఉన్న తీరుస్తూ అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ అవకాశం దొరికిన తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది సామాజిక మాధ్యమాలే వేదికగా ఎన్నికల ప్రచార హోరు ఊపందుకుంటుంది.

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు అందరికీ ఉంటున్నాయి. ప్రపంచంలో ఏ మూలన ఏం జరుగుతుందో క్షణాల్లో అరచేతిలో ప్రత్యక్షమవుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు మూస ధోరణి ప్రచార విధానాలకు స్వస్తి పలుకుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి అరచేతిలోనే మొబైల్ ఆయుధాన్ని వాడుతున్నారు. సామాజిక మాధ్యమాలపై పట్టు ఉన్న నాయకులు తామే స్వయంగా ఖాతాలను నిర్వహిస్తుండగా, వినియోగించుకుంటు మరికొందరు నాయకుల ఖాతాలను ప్రధాన అనుచరులు నిర్వహిస్తున్నారు. చిత్రాలు, వీడియోలు, ప్రచారం ప్రత్యర్థులపై విమర్శలు, కౌంటర్లు ఇస్తూ ముందుకు సాగుతున్నారు.

● ప్రత్యేకంగా వాట్సాప్ గూపులు



సర్పంచి ఎన్నికల వేళ అభ్యర్థుల పేరుతో ప్రత్యే కంగా మరికొన్ని గ్రూపులను ఏర్పాటు చేసుకుంటు న్నారు. ఆయా గ్రూపుల్లో తమ ప్రచారాలు, గ్రామాభి వృద్ధిపై ఓటర్ల అభిప్రాయాలు, నేతల సందేశాలు, హామీలు, రోజువారి కార్యక్రమాలను పోస్టు చేస్తు న్నారు. ప్రత్యర్థులు పెట్టే పోస్టులకు సమాధానంగా మరికొన్ని పోస్టులు పెడుతున్నారు. అభ్యర్థులతోపాటు వారి మద్దతుదారులు, కుటుంబ సభ్యులు వీటినే ప్ర చార అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళల పేరుతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటుచేసి గుర్తులను పెడుతూ గుర్తుంచుకోండి అంటూ ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థుల ఫొటోలు, గుర్తులతో ప్రత్యేక ఆకృతులను రూపొందించి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నిస్తున్నారు. తమకే ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. మొత్తంగా అభ్యర్థులు మామూలు ప్రచారం కంటే సోషల్ మీడియా ద్వారానే ప్రచారం ముమ్మరం చేసుకుంటున్నారు.

● గ్రూపుల్లో చర్చోపచర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపులు రాజకీయ చర్చలకు వేదికలుగా మారుతున్నాయి. పార్టీలకు సంబంధించిన వివిధ గ్రూపులతోపాటు గ్రామాలు, కుల సంఘాలు, యువజన సంఘాల పేర్లతో ఉన్న గ్రూపుల్లో ఎక్కడ చూసిన ఎన్నికలకు సంబంధించిన చర్చలు, పోస్టులే దర్శనమిస్తున్నాయి. నామినేషన్లు వేసిన, బరిలో ఉన్న, అభ్యర్థులకు అనుకూలంగా, ప్రతికూలంగా కామెంట్లు పెడుతు న్నారు. పార్టీల మద్దతు ఆశించి భంగపడ్డవారు, వారి అనుచరులు, అవకాశం దక్కిన వారు, వారి మద్దతుదారుల పోటాపోటీగా సోషల్ వార్ కొనసాగుతోంది.

వేములవాడ ఆలయ హుండీ ఆదాయం రూ.1.29కోట్లు

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ భీమేశ్వరాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ 14 రోజుల హుండీ ఆదాయం కోటి 29 లక్షల 27 వేల 470 రూపాయలు, 60.5 గ్రాముల మిశ్రమ బంగారం, 3 కిలోల 800 గ్రాముల మిశ్రమ వెండి సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈవో రమాదేవి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

అరుణాచలం, రామేశ్వరం ప్రత్యేక సర్వీసులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ డిపో నుంచి అరుణాచలం, రామేశ్వరానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. ఈ నెల 15న గోదావరిఖని బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 1గంటకు బయలు దేరి కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పళని, పాతాళ శంభు, మధురై, రామేశ్వరం విష్ణుకంచి, శివకంచి, జోగులాంబ పదియాత్రలు పూర్తి చేసుకుని, అనంతరం 22న గోదావరిఖని బస్టాండ్‌కు చేరుకుటుందని తెలిపారు. ఈ సర్వీస్ పెద్దలకు రూ. 8000, పిల్లలకు రూ.6000 చార్జీలు నిర్ణయించినట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 7382847596, 7013504982 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాటు సారా స్థావరాలపై పోలీసుల దాడులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బంజేరు గ్రామ పంచాయతీ పరిధిలోని కోక్యాతండాలోని సారా స్థావరాలపై ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 2 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. తయారీదారులైన గుగులోతు ప్రమీల, గుగులోతు చంకు, గుగులోతు రాంజీ, గుగులోతు కంసాలిలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ


- భారత్‌కు బంగారు పతకం సాధించిన అర్చన



చాంపియన్‌షిప్ కప్‌తో అర్చన

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆడబిడ్డ మిట్టపెల్లి అర్చన రాణించింది. ఫైనల్స్‌లో విజయం సాధించి బంగారు పతకం సాధించడంలో అర్చన కీలక పాత్ర పోషించింది. భారత్ విజయంలో సారధిగా నిలిచిన అర్చనకు మంగళవారం జిల్లాలోని క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. ఈ నెల 6, 7 తేదీలలో శ్రీలంకలో జరిగిన మొదటి సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలో భారత జట్టుకు అర్చన ప్రాతినిధ్యం వహించింది. ఫైనల్స్‌లో ఆతిధ్య దేశం శ్రీలంక జట్టుపై పోరాడి విజయం సాధించడంలో అర్చన కీలకపాత్ర పోషించింది. ప్రపంచ పారా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు నిర్మలరావత్ చేతుల మీదుగా విజేత భారత్ జట్టు సభ్యులు చాంపియన్‌షిప్ కప్‌తో పాటు బంగారు పతకాలు(మెడల్స్)ను అందుకున్నవారిలో అర్చన ఉంది. క్రీడలలో అంగవైకల్యం అడ్డుకాదని మహిళ జట్టు సభ్యులు నిరూపించి ఆదర్శంగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేటకు చెందిన మిట్టపల్లి అర్చన చిన్నతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎడమ చెయ్యి కాలిపోయింది. అయినా ఆత్మ విశ్వాసంతో ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూనే క్రీడలపై ఉన్న మక్కువతో మరోవైపు త్రోబాల్ ఆడుతూ మొక్కవోని దీక్షతో ముందుకు సాగింది. ఎంఏ, బీఈడీతో పాటు ఎంఎస్సీ పూర్తి చేసింది. ప్రభుత్వ ఉద్యోగం రాకున్నా నిరత్సాహపడలేదు. అవుట్ సోర్సింగ్‌లో చిన్న ఉద్యోగం చేస్తూ సొంత ఇల్లు లేకున్నా ఆర్థిక ఇబ్బందులున్న ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ త్రోబాల్ ప్రాక్టీస్ చేసింది. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనకు కనబరుస్తూ ఎన్నో పతకాలను సాధించిన అర్చన జట్టు సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపి యన్‌షిప్ పోటీల్లో శ్రీలంక జట్టుపై గెలిచింది.

తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో
'కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ'



కరీంనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళాకారులు తయారు చేసిన బుద్ధుడి ప్రతిమలు కనువిందు చేశాయి.పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుద్ధుడి ప్రతిమను అందజేశారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. ముందురోజు భక్తులు భీమేశ్వర స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేకంగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులు చెల్లించి బోనాలు సమర్పించారు.

ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

ఇల్లంతకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి కీసరి సుజాత కట్టిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడంపై మంగళవారం మండలస్థాయి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని కోరారు.

శాతవాహన యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



వివిధ కళాశాలల నుంచి హాజరైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. యూనివర్సిటీ మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ పోటీలకు యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రమాకాంత్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని గెలుపునకు ప్రయత్నించాలన్నారు. యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకొని అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో విజేతలుగా నిలిచి శాతవాహన యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్ మునావర్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్, వివిధ కళాశాలల వ్యాయామ అధికారులు, ఫుట్‌బాల్ కోచ్‌లు పాల్గొన్నారు.

ఏసీబీ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న కమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడే ఉద్యోగులపై చర్యలు తీసుకునేలా ప్రజలు ఏసీబీ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జాతీయ మానవ హక్కుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ అవినీతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఏసీబీ అడిషనల్ డీజీ చారుసింహా రాష్ట్రంలో అవినీతి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేయడం కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టడాన్ని తాము హర్షిస్తున్నామని అన్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు ఫోన్ నెంబర్లను ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద, పట్టణ, గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఏసీబీకి పట్టుబడ్డ అవినీతి ఉద్యోగులు కొన్ని నెలలకు మళ్లీ విధుల్లోకి చేరుతున్నారని ఇది బాధాకరమని అన్నారు. ఒకసారి ఏసీబీకి చిక్కిన అవినీతి ఉద్యోగులను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించే చట్టాలను ప్రభుత్వాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు చిప్ప దేవదాస్, ఉపాధ్యక్షులు వేముల పోశెట్టి, సభ్యులు చీకోటి అనిల్‌కుమార్, దేవులపల్లి శ్రీరాములు, కుసుమ గణేష్ ఉన్నారు.

పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద రూ.3 లక్షల నగదు పట్టివేత

గంభీరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు రూ. 3 లక్షల నగదును పట్టుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌లు పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 3 లక్షల నగదు పట్టుబడింది. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వెళుతున్న కారును సోదా చేయగా, 3 లక్షల నగదు లభ్యమైంది. దొరికిన రూ. 3 లక్షల నగదును సీజ్ చేశామని పోలీస్‌లు తెలిపారు.

రూ.7,450 పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లు చేపడుతున్న వ్యాపారులు

జమ్మికుంట, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 47మంది రైతులు 447క్వింటాళ్ల విడి పత్తి విక్రయా నికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

అవినీతి రహిత సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

గణేశ్‌నగర్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలని కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయ ఎల్ఎండీ క్యాంపస్‌లో గల ఫార్మసీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా కే శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవినీతి వల్ల కలిగే నష్టాలను వివరించారు. పారదర్శక, అవినీతి రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణకుమార్, పున్నం చందర్, కళాశాల విభాగాధిపతి జీయల్ అర్చన, అధ్యాపకులు డా బి భ్యాగ్యలక్ష్మి, డా కే సునీత, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యల నిలయాలుగా మారిన సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీలు, ఫుట్‌బాల్ ఆటల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై లేదని ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం చేనేత వస్త్ర వ్యాపారం సంఘం భవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాల్గవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా స్థానిక కార్మిక భవనం నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా సంఘం భవనం వరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం భవనం ఎదుట ఏఐఎస్ఎఫ్ జెండాను జిల్లా అధ్యక్షుడు రాకేష్ ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన మణికంఠరెడ్డి మాట్లాడారు. 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం విద్యార్థులను విస్మరించిందని దేశంలోని విద్యా వ్యవస్థను కార్పొరేటీకరణ, కాషాయికరణ చేయడానికి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. జాతీయ విద్యా విధానం పేరుతో దేశ వ్యాప్తంగా విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పాఠ్యాంశాలలో మత పరమైన అంశాలను చేరుస్తూ చరిత్రను తొలగించే ప్రయత్నాలను విద్యార్థులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విభజన హామీలలో తెలంగాణకు రావాల్సిన కేటాయింపులను తీసుకురావడంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విఫలమయ్యారన్నారు. తెలంగాణలో రెండేళ్ల ప్రజాపాలనలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేక పోయిందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారిరాములు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బాలికల విభాగం కో కన్వీనర్ కండె విజేత, జిల్లా కార్యదర్శి మంద అనిల్, నాయకులు పెండల ఆదిత్య, ముద్రకోల శశికుమార్, బండారి చందు, బండి ప్రణయ్, వంశీ ఉన్నారు.

అటవీ అధికారిపై దాడి.. కేసు నమోదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు9(ఆంధ్ర జ్యోతి): వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో ఎఫ్‌బీవో బోనాల శ్రీకాంత్‌పై దాడి చేసిన సంఘటనలో అదే తండా వాసి తేజావత్ మోహన్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. తండా శివారులోని అటవీ భూమిలోకి మోహన్ అక్రమంగా ప్రవేశించడంతో పాటు బోరు బావి తవ్విస్తున్నాడనే సమాచారంతో ఎఫ్‌బీవో శ్రీకాంత్ అక్కడకు చేరుకున్నారని పేర్కొన్నారు. అటవీ భూమిలో బోరు ఎందుకు వేయిస్తున్నావని ప్రశ్నిస్తే దాడికి దిగాడని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మోహన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ లక్ష్మణ్ వివరించారు. అటవీభూమి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు

పెద్దపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్, ట్రాన్స్కో, జెన్కో సంస్థలలో పనిచేసే విద్యుత్ ఉద్యోగులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. మంగళవారం పెద్దపల్లి పట్టణంలోని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు రూ. 11270 విలువైన సీబీపీ, ఆర్బీఎస్, 2డీ ఎకో, టీఎంటీ, ఎక్స్రే, బీపీ పరీక్షలతో పాటు కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, నెఫ్రాలజిస్టు, డైటీషియన్, ఫిజియోథెరపీ, గైనకాలజిస్టు వైద్యులతో కన్సల్టేషన్ ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ.1000కే ఈ పరీక్షలన్నీ చేస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యుత్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ సరఫరా గడువులోగా పూర్తి చేయాలి

పెద్దపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్కు సంబంధించి సీఎంఆర్ రైస్ సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ వేణుతో కలిసి సీఎంఆర్ రైస్ డెలివరీపై అధికారులు, రైస్ మిల్లర్ల సంఘాలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ సరఫరాలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని, గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎఫ్సీఐ నిబంధనల ప్రకారం రా రైస్, పాలిష్ రైస్ నాణ్యత లోపం వంటి సమస్యలు పరిష్కరించి ఎటువంటి సమస్యలు లేకుండా పూర్తిచేయాలని ఎఫ్సీఐ అధికారులకు సూచించారు. రైస్మిల్లర్లకు సంబంధించి రోజు వారీగా రిజిస్టర్ నమోదు చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, ఎఫ్సీఐ డివిజనల్ మేనేజర్ రవిప్రకాష్ పాల్గొన్నారు.

ఏకగ్రీవాల్లో పలువురు కాంగ్రెస్ మద్దతుదారులు

● మూడు విడతల్లో 13 పంచాయతీలు ఏకగ్రీవం

పెద్దపల్లి, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతున్నది. మూడు విడతల్లో జరుగుతున్న ఎన్నికల్లో మొదటి విడతలో నాలుగు, రెండో విడతలో మూడు, మూడో విడతలో ఆరు పంచాయతీలు, మొత్తం 13 పంచాయతీల సర్పంచ్ స్థానాలు, పలు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఒక్కరు మినహా 12 మంది సర్పంచులు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే కావడం గమనార్హం. మూడో విడతలో పెద్దపల్లి, ఓదెల, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల్లోని 91 పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలకు 401 మంది అభ్యర్థులు, 852 వార్డు స్థానాల్లో 851 స్థానాలకు 2014 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే నాటికి పెద్దపల్లి మండలం రాంపెల్లి సర్పంచ్గా కనపర్తి సంపత్రావుతోపాటు 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఓదెల మండలం పిట్టల ఎల్లయ్యపల్లి సర్పంచ్గా పిట్టల రవికుమార్ సహా 8 మంది వార్డు సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలిగేడు మండలం ర్యాకల్దేవ్పల్లి సర్పంచ్గా మద్దెల రమాదేవి, సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి సర్పంచ్గా కొత్తూరు స్వరూప, రామునిపల్లి సర్పంచ్గా సబ్బని అనసూయ, నారాయణరావుపల్లె సర్పంచ్గా నామిని రాజిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొదటి విడతలో మంథని మండలం నాగారం సర్పంచ్గా బెల్లంకొండ శ్రీదేవి, తోట గోపయ్యపల్లి సర్పంచ్గా దొబ్బ రమేష్తోపాటు ఆరుగురు వార్డుసభ్యులు, ఖైదుపల్లి సర్పంచ్గా పంతంగి లక్ష్మన్, రామగిరి మం డలం చందనాపూర్ సర్పంచ్గా కొండా మంజుల ఎన్ని కయ్యారు. ఈ విడతలో మొత్తం 211 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. రెండో విడతలో ధర్మారం మండలం బొట్లవనపర్తి సర్పంచ్గా సంగ రంజిత్, బంజేరుపల్లి సర్పంచ్గా ఇందిర, నాయకంపల్లి తండా సర్పంచ్గా గెనెల్లి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విడతలో మొత్తం 135 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అధికారులు తెలిపారు. సర్పంచ్ స్థానాల్లో ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే ఎక్కువగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం గమనార్హం.

తుది విడత ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ





అనసూయ రాయమల్లు, స్వరూప రవీందర్, రాజిరెడ్డి





సర్పంచ్గా ఎన్నికైన పిట్టల రవీందర్, రమాదేవి, ఏకగ్రీవంగా ఎన్నికైన రాంపల్లి పాలకవర్గం

సుల్తానాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడో విడత పంచాయతీ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత 24 గ్రామ పంచాయతీలకుగాను 82 మంది అభ్యర్థులు సర్పంచులుగా పోటీలో ఉన్నారని ఎంపీడీవో దివ్యదర్శన్ రావు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా మూడు సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. మిగిలిన 24 పంచాయతీల్లో 82 మంది సర్పంచ్కు పోటీ చేస్తున్నారు. 246 వార్డు స్థానాలకుగాను బొంతకుంటపల్లి మూడో వార్డులో ఒక్క నామినేషన్ పడలేదు. మిగిలిన 245 వార్డు స్థానాలకు 74 వార్డు ఏకగ్రీవం కాగా 171 వార్డులకు 415 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. గొల్లపల్లి, నారాయణరావుపల్లి, రామునిపల్లి గ్రామాలలో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నారాయణరావుపల్లి సర్పంచ్గా పోటీ చేసేందుకు నామిని రాజిరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. రాముని పల్లిలో సుబ్బని అనసూయ రాయమల్లు ఏకగ్రీవమయ్యారు. గొల్లపల్లిలో పోటీలో ఉన్న బండారి రమేష్ నామినేషన్ ఉపసంహరించుకోవడంతో కొత్తూరి స్వరూప రవీందర్ ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని 30 గ్రామ పంచాయతీలకుగాను రాంపల్లి సర్పంచ్గా కనపర్తి సంపత్రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. నామినేషన్ ఉపసంహరణ అనంతరం 29 గ్రామ పంచాయతీల్లో 97 మంది సర్పంచ్లు పోటీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. 294 వార్డు స్థానాలకు 68 స్థానాలు ఏకగ్రీవమయ్యాయని, 226 వార్డులకుగాను 654 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు తెలిపారు. బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించినట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి మండలం రాంపల్లి సర్పంచ్గా కనపర్తి సంపత్ రావు ఏకగ్రీవం కాగా గ్రామంలోని 8 వార్డులు సైతం ఏకగ్రీవమయ్యాయి. 1వవార్డు జనగామ శ్రీనివాస్, 2వ వార్డు కనికిరెడ్డి స్వరూప, 3వ వార్డుబొంకూరి దుర్గయ్య, 4వ వార్డు సుద్దాల విజయ, 5వ వార్డు బొంగాని రమేష్, 6వ వార్డు మడుపు జయ లక్ష్మి, 7వ వార్డు కన్నం సంధ్య, 8వ వార్డు కనుకుంట్ల అంజయ్లు ఎన్నికయ్యారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లిలో సర్పంచ్తో పాటు 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ గా పిట్టల రవి కుమార్, ఉపసర్పంచ్గా ఐదవ వార్డు అభ్యర్థి పెండెం శ్రీకాంత్ ఎన్నికయ్యారు. అలాగే వార్డు సభ్యులుగా తూడి అహల్య, బండి రాజ్కుమార్, కనుకుంట్ల శ్రీనివాస్, పిట్టల నవీన్, రాయిళ్ల సుస్మిత, పిట్టల శారద, కందుల వనిత ఏకగ్రీవమయ్యారు. ఎన్నికైన పాలకమండలిని గ్రామస్థులు సన్మానించారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల పరిధిలో సర్పంచ్ పదవి కోసం 47 మంది నామినేషన్ వేశారు. ఇందులో 15 మంది ఉపసంహరించుకున్నారు. ర్యాకల్దేవుపల్లి సర్పంచ్గా మద్దెల ర మాదేవి ఏకగ్రీవంగా కాగా, మరో31 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 114 వార్డు స్థానాల్లో 269 మంది నామినేషన్ వేయగా, 35 వార్డు స్థానాల్లో ఉపసంహరణలు జరిగాయి. 34 వార్డు స్థానాల్లో ఏకగ్రీవం కాగా, 200 మంది వార్డు అభ్యర్థులు బరిలో నిలిచారు. పోటీలో నిలిచిన సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు గుర్తులను కేటాయించారు. ర్యాకల్దేవు పల్లిలో సర్పంచ్ అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్లు వేశారు. ఇందులో మామిడిపల్లి కరుణ, తీట్ల స్వప్నలు ఉపసంహరించుకున్నారు. దీంతో మద్దెల రమాదేవి సంపత్ ఏకగ్రీవంగా ప్రకటించారు.

'గుర్తు' గుర్తుంచుకో...!

(5వ పేజీ తరువాయి)

ఓటర్లకు గుర్తుండేలా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా జరుగుతుండడంతో పార్టీ గుర్తులకు బదులు ఇతర గుర్తులను కేటాయిస్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి 30 గుర్తులు, వార్డు సభ్యుల కోసం 20 గుర్తులను ప్రకటించింది. వాటిని అక్షరమాలను అనుసరించి అభ్యర్థులకు కేటాయించారు. సర్పంచ్ పదవికి గులాబీ రంగు బ్యాలెట్, వార్డు సభ్యుడి పదవికి తెలుపు రంగు బ్యాలెట్ పత్రాన్ని ఉపయోగిం చనున్నారు.

● **రేపు మొదటి విడత పోలింగ్..**

జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు, 2432 వార్డు స్థానాలు ఉన్నాయి. మొదటి విడతలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్పూర్, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో 99 పంచాయతీలు, 896 వార్డు స్థానాలు ఉన్నాయి. మంథని మండలంలో మూడు, రామగిరి మం డలంలో ఒక పంచాయతీ సర్పంచ్ స్థానం, మొత్తం 211 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 98 పంచా యతీల్లో 95 సర్పంచ్ స్థానాలు 685 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నాలుగు రోజుల నుంచి ఆయా గ్రామాల్లో తమకు కేటాయించిన గుర్తుల గురించి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనున్నది. మంగళ వారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారం ముగిసింది. కేవలం మౌఖిక ప్రచారం మాత్రమే చేయాల్సి ఉంటుంది. రెండో విడతలో ధర్మారం, పాలకుర్తి, అం తర్గాం, జూలపల్లి మండలాల్లో అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం మూడో విడత ఎన్నికలు జరుగుతున్న పెద్దపల్లి, ఓదెల, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల్లో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. దీంతో సదరు అభ్యర్థులు బుధవారం నుంచి గుర్తులతో ప్రచారపర్వం మొదలు పెట్టనున్నారు.

క్రిస్టియన్గా మారిన వ్యక్తి నామినేషన్ను రద్దు చేయాలి

పెద్దపల్లి టౌన్/ఓదెల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దళిత వర్గానికి చెందిన ఒక వ్యక్తి క్రిస్టియన్గా మారి ఎస్సీ సర్టిఫికెట్పై వేసిన నామినేషన్ రద్దు చేయాలని శంకరయ్య అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓదెల మండలం కొలనూరు సర్పంచ్ స్థానానికి ఎస్సీలకు రిజర్వు చేశారని తెలిపారు. ఈ స్థానంలో ఎస్సీ మాదిగ వర్గం నుంచి క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తి ఎస్సీ సర్టిఫికెట్తో నామినేషన్ దాఖలు చేయడంపై గ్రామస్థుడు శంకరయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. పల్లె కనకయ్య ఎస్సీ మాదిగ వర్గానికి చెందినప్పటికీ మతం మార్చుకుని క్రిస్టియన్గా ఉన్నారు. అయినప్పటికీ ఆయన ఎస్సీ మాదిగ సర్టిఫికెట్ను ఉపయోగించి సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారని ఆరోపించారు. ఆర్డీఓ, ఎంఆర్ఓ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు శంకరయ్య పేర్కొన్నారు. అధికారులు సర్టిఫికెట్ను పరిశీలించి నామినేషన్ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష

కమాన్పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కమాన్పూర్, బేగంపేట ప్రాథమిక ఆరోగ్యాల కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలతో మంగళవారం జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిల్లో ప్రసవాలు పెంచాలన్నారు. గర్భిణీలు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తొలి, రెండు ఆరోగ్య పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మూడు, నాల్గో జనరల్ ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. పరీక్షల కోసం గర్భిణీల తరలింపునకు 102 సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రోగ్రాం అధికారి రాజమౌళి,డాక్టర్లు రవి, శ్రీరాములు, సుధాకర్, కమాన్ పూర్, బేగంపేట వైద్యాధికారులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

మంథని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 11న జరిగే తొలి విడుత పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీసీపీ భూక్యా రాంరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో మంథని ఉన్నత పాఠశాల, కమాన్పూర్ జెడ్పీహెచ్ఎస్లోని, రామగిరి మండలంలోని పోలింగ్ సామగ్రి పంపిణీ చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను డీసీపీ, ఏసీపీ మడత రమేష్లు మంగళవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సామగ్రి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిస్ట్రి బ్యూషన్ సెంటర్ల వద్ద 24 గంటల నిఘా, పోలీసు పికెటింగ్, సీసీ కెమెరా పర్యవేక్షణ ఉండాలన్నారు. మంథని, టూటౌన్ సీఐలు రాజు, ప్రసాద్రావు, ఎస్ఐ లు రమేష్, శ్రీనివాస్, ప్రసాద్లు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ముత్తారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ ఎస్.రవి కుమార్ సూచించారు. మండల కేంద్రంతోపాటు అడవీ శ్రీరాంపూర్, ఓడేడు, కేశనపల్లి గ్రామాల్లో మంగళవారం ఫ్లాగ్ మార్చ్నిర్వహించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు పకడ్బందీగా భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై పోలీసుల కసరత్తు

రామగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కసరత్తు చేపట్టారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని డీసీపీ రాంరెడ్డి పరిశీలించారు. ఎన్నికల నిబంధనల పై అధికారులతో చర్చించారు. అనంతరం మండలం కేంద్రంలో సాయిరాం గార్డెన్లో ఎన్నికల నియమావళి, నిబంధనల పై విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి అవగాహన సదస్సును చేపట్టారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ఎన్నికల్లో పోలీసులు తీసుకోవాల్సిన అంశాలను, జాగ్రత్తలను వివరించారు.

అభివృద్ధిపై దృష్టి సారించని శ్రీధర్బాబు

మంథనిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గంపై దృష్టి సారించడం లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. అడవిసోమన్పల్లి మానేర్ వంతెనను మంగళవారం పరిశీలించారు. అడవి సోమన్పల్లి వంతెనకు సగంవరకు సున్నం వేసి మరో వైపు వేయకుండా వదిలివేశారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బ్రిడ్జిలు, ప్రాజెక్టులు నిర్మించామని గుర్తు చేశారు. జక్కు శ్రీహర్షిణీ, రాకేష్, తగరం శంకర్లాల్, మాచీడి రాజుగౌడ్, మిర్యాల ప్రసాద్రావు, కాయితీ సమ్మయ్య, కుమార్లు పాల్గొన్నారు.

శ్రీధర్బాబుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

మంథని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్బాబు పై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అసత్య ఆరోపణలు చేస్తే సహించమని మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, పీఏసీఎస్, ఏఎంసీ చైర్మన్లు కొత్త శ్రీనివాస్, కుడుదుల వెంకన్న, వొడ్నాల శ్రీనివాస్లు స్పష్టం చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. రెండేళ్ళలో ఎంతో మందికి ఉద్యోగాలు పెట్టించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కాపాడుకోవటానికి మంత్రి శ్రీధర్బాబు, ఆయన కుటుంబం పై రాజకీయ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నేతలు బూడిద శంకర్, సత్యనారాయణరెడ్డి, ప్రవీణ్, ఆరెల్లి కిరణ్గౌడ్, బండారి ప్రసాద్, రాజేందర్లు పాల్గొన్నారు.

యైటింక్లయిన్కాలనీ, (ఆంధ్రజ్యోతి): మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రాజకీయ ఉనికి కాపాడుకునేందుకే మంత్రి శ్రీధర్బాబుపై విమర్శలు చేస్తున్నట్టు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరికి మహేష్ అన్నారు. ఉద్యోగాల కల్పనలో శ్రీధర్బాబు విఫలమైనట్టు చేసిన ఆరోపణలు ఖండిస్తున్నామని, రెండేళ్ళలో 60వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చినట్టు తెలిపారు. మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, తిరుపతిరెడ్డి, రాములు, మార్కరాజు, సారయ్యనాయక్, అవినాష్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు వద్దు

ఓదెల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరు సోషల్ మీడియాలో ఒకరిని ఉద్దేశించి రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ కోరారు. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 22 గ్రామపంచాయతీల్లో స్థానిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. నియమాలను ఉల్లంఘించినా చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి



ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులతో ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుని గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకుపోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు ఓటర్లకు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ పట్టణంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని సుల్తానాబాద్, ఓదెల, ఏలిగేడు, పెద్దపల్లి మండలాలకు చెందిన ఆరుగురు అభ్యర్థులు సర్పంచ్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంద ర్భంగా వారిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఆరుగురు సర్పంచ్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. మిగతా గ్రామాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్న య్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాశ్రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, అజయ్గౌడ్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్-చిన్నరాతుపల్లికి రోడ్డు నిర్మాణం

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ నుంచి దామన్నకుంట కట్టమీదుగా చిన్నరాతుపల్లి వరకు రూ.5 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. కిష్టంపేట, బోర్నపల్లి మధ్యలో మానేరుపై రూ.150 కోట్లతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. మంగళవారం పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్, కిష్టంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల్లో లోపాలు తలెత్తకుండా చూడాలి

కోల్సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్లో ప్రజలకు మౌలిక వసతులు పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణలో లోపాలు తలెత్తకుండా వార్డు అధికారులు సమర్థవంతంగా పర్యవేక్షణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ సూచించారు. మంగళవారం వార్డు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ప్రవేశపెట్టిన రెండు పూటల పని విధానాన్ని, సిబ్బంది హాజరు, చెత్తసేకరణ, బీఆర్సీ కేంద్రానికి పొడి చెత్త, కంపోస్ట్ యార్డుకు చెత్త వెళ్లేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఈఈ రామన్, సెక్రటరీ ఉమా మహేశ్వర్రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, డీఈలు, ఏఈలు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలి

కళ్యాణ్నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 11న తలపెట్టిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని ఇంటర్ డినామినేషన్ పాస్టర్ ఫెలోషిప్ బాధ్యులు మహిపాల్రెడ్డి, ఐజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్క్లబ్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రాం డ్ క్రిస్మస్కు క్రైస్తవులు తరలిరావాలని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ఠాకూర్, సందేశకులు రాజా హెబెల్ హాజరవుతారన్నారు. దయానంద్ గాంధీ, జిమ్మిబాబు, పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ



తెలంగాణ తల్లి విగ్రహానికి వందనం చేస్తున్న అధికారులు, కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సబ్బండ వర్గాల ఆకాంక్షలకు స్ఫూర్తిగా తెలంగాణ తల్లి విగ్రహం రూపుదిద్దుకుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల ప్రజల పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై మొదటిసారి సానుకూల ప్రకటన వచ్చిందన్నారు. ప్రజల పోరాట ఫలితాలను స్మరించుకుంటూ కలెక్టరేట్లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సంతోషంగా ఉందన్నారు. కలెక్టరేట్ను సంద ర్శించే ప్రజలను ఆకట్టుకునేలా విగ్రహ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా పాలన అధికారి ప్రకాష్, ఆర్అండ్బీ ఈఈ భావ్ సింగ్ అధికారులు, పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీ



ఖనిలో కేక్కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ అన్నారు. మంగళవారం ఆమె జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఖని చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కేక్కట్ చేశారు. కాల్వ లింగస్వామి, గట్ల రమేష్, రాజేష్, కొప్పుల శంకర్, చుక్కల శ్రీనివాస్, ఫజల్ బేగ్, బొంతల లచ్చన్న, దాసరి విజయ్ పాల్గొన్నారు. మంథని వెంకటేష్ ఆధ్వర్యంలో రమేష్నగర్లో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కేక్కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. లక్ష్మణ్బాబు నారాయణ, రవి యాదవ్, ఖలీం, అనీల్, శ్రీధర్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలను గౌరవించి తెలంగాణ రాష్ట్రాన్ని సోనియాగాంధీ ఇచ్చారని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు అన్నారు. సోనియా గాంధీ జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. శ్రీగిరి శ్రీనివాస్, దామోదర్రావు, మహేందర్, అబ్బయ్యగౌడ్, రాజయ్య, పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): సోనియా గాంధీపుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అంబేద్కర్ చౌక్లో నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. మం డల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మున్సిపల్ చైర్పర్సన్ పెండ్రి రమ-సురేష్రెడ్డి, పాల్గొన్నారు.

ఎలిగేడు/జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిర్వహించారు. కొమ్ము పోచాలు, బండి స్వామి, సామ రాజేశ్వర్రెడ్డి, సంతోష్రావు, పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ



అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కోరుకంటి చందర్, దాసరి మనోహర్రెడ్డి, అంబేద్కర్ నివాళులర్పిస్తున్న పుట్ట మధు

గోదావరిఖని, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో తెలంగాణ అమరుల స్తూపం వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి, అయ్యప్ప టెంపుల్ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అమరవీరులకు నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ దీక్ష ఫలితంగానే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన చేశారన్నారు. మూల విజయరెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, కృష్ణవేణి, విజయ, పాల్గొన్నారు.

పెద్దపల్లి, (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్రెడ్డి విమర్శించారు. మంగళవారం విజయ్ దివాస్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన కారణంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. మాజీ జడ్పీటీసీ రాములు యాదవ్, తిరుపతిరెడ్డి, రాజ్కుమార్, పాల్గొన్నారు.,

మంథని, (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో విజయ్ దివస్ నిర్వహించారు. పాత పెట్రోల్ పంపు సమీపంలోని తెలంగాణ తల్లి, స్థానిక ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళుల ర్పించారు.



గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ సమావేశం

యైటింక్లయిన్కాలనీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 యాజమాన్యం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులతో స్ట్రక్చర్ సమావేశం నిర్వహించింది. ఓసీపీ-3 అన్ని సెక్షన్లలో కన్వేయన్స్ వాహనాలు అందుబాటులో ఉంచాలని, బేస్వర్క్షాప్తో పాటు ఎస్అండ్డీ సెక్షన్లలో పార్కింగ్ షెడ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సీహెచ్పీ కార్మికులకు లెదర్ షూస్ ఇవ్వాలని, కాలనీ షిర్కే చౌరస్తాలో బస్ స్టాప్ను నిర్మించాలని ప్రతిపాదించారు. జీఎం బండి వెంకటయ్య, ఎస్వోటూ జీఎం రాముడు, ఏజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏఐటీయూసీ నాయకులు రవీందర్, రాజారత్నం, శ్యాంసన్, సాంబశివరావు, రవికుమార్ పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం సరికాదు

యైటింక్లయిన్కాలనీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహించడం సరికాదని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి రాజారత్నం అన్నారు. మంగళవారం ప్రెస్భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు లాభాల వాటా, లాభాల బోనస్ ఇవ్వలేదని తెలిపారు. మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వడంలో యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. రవీందర్, శ్యాంసన్, సాంబశివరావు, అన్నారావు, మహేందర్ పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్ను సందర్శించిన తనిఖీ బృందం

గోదావరిఖని, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం రామగుండం ఏరియా హాస్పిటల్ను తనిఖీ బృందం కన్వీనర్ డాక్టర్ పీ రమేష్ బాబు, ఇతర సభ్యులు సందర్శించారు. ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్రావు, ఏరియా రక్షణ అధికారి సాయి ప్రసాద్, తనిఖీ బృందం డాక్టర్ శేషగిరిరావు, కమిటీ సభ్యులు హరి శంకర్ డీజీఎం(ఐటీ) కార్పొరేట్, ఏరియా హాస్పిటల్ ఏసీఎంఓ బీ అంబికా, డీవైసీఎంఓ ప్రసన్నకుమార్, డాక్టర్ మద్దిలేటి, డాక్టర్ అరవింద్ పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కన్వీనర్ డాక్టర్ పీ రమేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగి ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు.

కమిటీ సభ్యులతో పాటు డాక్టర్స్, స్టాఫ్ నర్స్లు, అధికారులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ కుటుంబానికి చేయూత

యైటింక్లయిన్కాలనీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా కాంట్రాక్టర్ రాయినేని రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. రాజు కుటుంబానికి అండగా నిలవాలని రూ. 5లక్షల చెక్కును మంగళవారం రాజు కుటుంబీకులకు అందజేశారు. కాంట్రాక్టర్లు మహేందర్రెడ్డి, తన్నీరు రమేష్, బత్తిని శ్రీనివాస్, అంకాల శ్రీనివాస్, శ్రీరాముల సత్యనారాయణ, అన్వర్, గురజాల మహేందర్, శరత్, అశోక్, కూర శ్రీనివాస్ ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న జీఎం లలిత్ కుమార్

కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం

గోదావరిఖని, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల్లో సింగరేణి జట్టు సిల్వర్ మెడల్ సాధించింది. గత నెల నవంబర్ 28 నుంచి 30వరకు కొత్తగూడెంలో జరిగిన పోటీల్లో 8జట్లు పాల్గొన్నాయి. ఆర్జీ-1 నుంచి కైలసాకోటి శ్రీనివాస్, ఈపీ ఆపరేటర్ ఓసీ-5, బుద్దా శ్రీనివాస్, హెడ్ ఓవర్ మెన్, ఓసీ-5, మీస హరీష్ మైనింగ్ సర్దార్, జీడికే 1,3ఇంక్లైన్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, ఏజీఎం(ఐఈడీ) ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ ఎం రవీందర్రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జీ హనుమంత రావు, స్పోర్ట్స్ సూపర్వైజర్ హెచ్ రమేష్ పాల్గొన్నారు.